


# విభారే
## తెలుగు దినపత్రిక
## VIBHARE TELUGU DAILY




PUBLISHED FROM KURNOOL ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి శనివారం 25-05-2024 సంపుటి : 06 సంచిక : 251 పేజీలు : 8 వెల : రూ 3-00


# 6వ దశ పోలింగ్ కు సర్వం సిద్ధం



న్యూఢిల్లీ, మే 24, దేశ వ్యాప్తంగా జూన్ 1వ రకు మొత్తం ఏడు దశల్లో జరుగుతున్న లోక్ సభ ఎన్నికల్లో ఇప్పటికే 5 దశలు పూర్తైన సంగతి తెలిసిందే. ఆరో దశ ఎన్నికలు శనివారం జరగనున్నాయి. ఆరో దశ లోక్‌సభ ఎన్నికలు దేశ రాజధాని ఢిల్లీతో సహా మొత్తం 7 రాష్ట్రాలు, రెండు కేంద్రపాలిత ప్రాంతాల్లో 58 నియోజకవర్గాలకు జరగనున్నాయి. బీహార్ 8 సీట్లు, హర్యానా 10 సీట్లు, జమ్మూ కాశ్మీర్ 1 సీటు, జార్ఖండ్ 4 సీట్లు, ఢిల్లీ 7 సీట్లు, ఒడిశా 6 సీట్లు, ఉత్తరప్రదేశ్ 14 సీట్లు, పశ్చిమ బెంగాల్ 8 సీట్లకుగానూ.. మొత్తం 889 మంది అభ్యర్థులు పోటీ చేయనున్నారు. లాజిస్టికల్, కమ్యూనికేషన్ అండ్ కనెక్టివిటీకి సంబంధించి అడ్డంకుల కారణంగా గత నెలలో ఎన్నికల సంఘం జమ్ముకశ్మీర్‌లోని అనంతనాగ్-రాజౌరీ లోక్‌సభ స్థానానికి పోలింగ్ తేదీని మే 7 నుంచి మే 25 మార్చింది. ఇక రేపు జరగనున్న ఆరో దశ ఎన్నికలకు ఇప్పటికే ఎలక్షన్ కమిషన్ అన్ని ఏర్పాట్లు చేసింది. మే 25న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ జరగనుంది. 6వ దశ ఎన్నికలకు ఉత్తరప్రదేశ్‌లో అత్యధికంగా 14 పార్లమెంటరీ నియోజకవర్గాల నుంచి 470, హర్యానాలో 10 నియోజకవర్గాల నుంచి 370 నామినేషన్లు వచ్చాయి. ఈ దశలో ఒక్కో పార్లమెంటరీ నియోజకవ ర్గానికి పోటీ చేసే అభ్యర్థుల సగటు సంఖ్య 15 అని పోల్ బాడీ పేర్కొంది. ఏడు దశల ఎన్నికలు పూర్తైన తర్వాత జూన్ 4న ఓట్ల లెక్కింపు జరగనుంది. ఇక అదే రోజు ఫలితాలను కూడా ప్రకటించేందుకు కేంద్ర ఎన్నికల సంఘం ఏర్పాట్లు చేస్తుంది. 8 రాష్ట్రాల్లో 58 నియోజకవర్గాలకు పోలింగ్ జరగనుంది. ఇక ఈ ఆరో దశలో 869 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు. అయితే ఈసారి అందరి దృష్టి ఢిల్లీపైనే ఉంది. హస్తినలో బీజేపీ ముమ్మర ప్రచారం నిర్వహించడం, ఆప్ అధినేత కేజ్రీవాల్ అరెస్టై బెయిల్‌పై బయటకు రావడం లాంటి అంశాలతో ఢిల్లీలో ఎవరు గెలుస్తారన్న ఆసక్తి మరింత పెరిగింది. ఇప్పటికే కేజ్రీవాల్ మీడియా సమావేశాలు నిర్వహించారు

# ముంచుకొస్తున్న తుపాను

## 'రేమాల్'గా నామకరణం
## రాగల 24గం॥ల్లో భారీ వర్షాలు
## విశాఖ వాతావరణ శాఖ వెల్లడి



అమరావతిమే24, ):పశ్చిమ మధ్య బంగా ళాఖాతంలో వాయుగుండం ఏర్పడిందని విశాఖ వాతావరణ శాఖ అధికారి డాక్టర్ సునంద్ వెల్లడించారు. రాగల 24 గంటల్లో తుఫాను గా అనంతరం తీవ్ర తుఫానుగా మారే అవకాశముందని హెచ్చరించారు. తుఫానుకు 'రేమాల్' గా నామకరణం చేసినట్లు ఆయన పేర్కొన్నారు. తుఫాను ఈశాన్య దిశగా కదిలి బంగ్లాదేశ్ తీరంలో27అర్ధరాత్రి దాటాక తీరం దాటేఅవకాశంఉందని తెలిపారు. ఒడిస్సా, బంగాల్, బంగ్లాదేశ్‌పై తుఫాను ప్రభావం ఉంటుందని చెప్పారు. మత్స్యకారులు ఎవరూ కూడా మధ్య బంగాళాఖాతంలోకి చేపల వేటకు వెళ్లరాదని సూచించారు. తుఫాను ప్రభావం ఆంధ్ర ప్రదేశ్ పై ఉండదని వివరించారు. అయితే అత్యధిక ఉష్ణోగ్రతలు యథావిధిగా కొనసాగుతాయని అన్నారు. నైరుతి రుతుపవనాలు శ్రీలంక వరకు విస్తరించాయని పేర్కొన్నారు. తుఫాను ప్రభావంతో రుతుపవనాలు వేగంగా కదులుతున్నాయని తెలిపారు.

# ఎన్నికల కేసుల్లో నిందితులైన అభ్యర్థులకు హైకోర్టులో ఊరట



విజయవాడ, మే 24 ఈ నెల 13న ఎన్నికల సందర్భంగా జరిగిన గొడవలు, అల్లర్ల కేసుల్లో ప్రధాన నిందితులుగా ఉన్న టీడీపీ, వైసీపీ అభ్యర్థులకు ఏపీ హైకోర్టులో తాత్కాలికంగా ఊరట లభించింది. జూన్ 6 వరకూ వారిని అరెస్ట్ చెయ్యొద్దని పోలీసులను న్యాయస్థానం ఆదేశించింది. ఈ ఆదేశాలతో మాచర్ల పోలింగ్ కేంద్రంలో ఈవీఎం ధ్వంసం కేసులో నిందితుడిగా ఉన్న పిన్నెల్లి రామకృష్ణారెడ్డికి ఉపశమనం లభించినట్లయింది. అటు, తాడిపత్రి వైసీపీ అభ్యర్థి కేతిరెడ్డి పెద్దారెడ్డి, నరసరావుపేట వైసీపీ అభ్యర్థి గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి, దెందులూరు టీడీపీ అభ్యర్థి చింతమనేని ప్రభాకర్, తాడిపత్రి టీడీపీ అభ్యర్థి జేసీ అస్మిత్ రెడ్డిలకు సైతం అరెస్ట్ నుంచి రక్షణ కల్పించింది. జూన్ 4న ఓట్ల లెక్కింపు సందర్భంగా, బరిలో ఉన్న అభ్యర్థులు పోలింగ్ ఏజెంట్లను నియమించుకోవాల్సి ఉన్నందున అరెస్ట్ నుంచి రక్షణ కల్పించాలన్న పిటిషనర్ల తరపున లాయర్ల వాదనతో ధర్మాసనం ఏకీభవించింది. అయితే, వీరికి కొన్ని షరతులు విధించిన న్యాయస్థానం.. వీరి కదలికలపై ఎన్నికల సంఘం పోలీసులతో నిఘా, పర్యవేక్షణ ఉంచాలని ఆదేశించారు. అభ్యర్థుల వెంట నలుగురికి మించి ఉండరాదని స్పష్టం చేసిన ధర్మాసనం.. సాక్షులను బెదిరించకూడదని, దర్యాప్తులో జోక్యం చేసుకోవడానికి వీల్లేదని తెలిపింది. కేసు లోతుల్లోకి వెళ్లకుండా ఈ మేరకు తాత్కాలిక ఉత్తర్వులు ఇస్తున్నట్లు పేర్కొంది. తదుపరి విచారణను జూన్ 6కు వాయిదా వేసిన కోర్టు.. ప్రధాన వ్యాజ్యాల్లో పోలీసులు కౌంటర్ దాఖలు చేయాలని వెల్లడించింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి గురువారం ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు.

# తెలంగాణ ఆవిర్భావ వేడుకలకు ఈసీ గ్రీన్ సిగ్నల్




హైదరాబాద్ మే 24 : తెలంగాణలోని రేవంత్ సర్కార్‌కుఈసీ శుభవార్తచెప్పింది.రాష్ట్రఅవతరణవేడుకలు నిర్వహిం చుకునేందుకు అనుమతి ఇచ్చింది. దీంతో జూన్ 2న ఘనంగా రాష్ట్ర అవతరణ వేడుకలను సికింద్రాబాద్ లోని పరేడ్ గ్రౌండ్స్ లో నిర్వహిం చేందుకు ఏర్పాట్లు ప్రారంభించింది ప్రభుత్వం. ఏర్పాటకు సంబంధించి ఈరోజుచీఫ్ సెక్రటరీశాంతికుమారి అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం అనుకుంటున్న షెడ్యూల్ ప్రకారం.. జూన్ 2న తొలుత సీఎం రేవంత్ రెడ్డి గన్ పార్కులో అమరవీరుల స్థూపానికి నివాళులు అర్పించనున్నారు. అనంతరంపరేడ్ గ్రౌండ్ లో సభను నిర్వహించ నున్నారు. ఈ సభకు ముఖ్య అతిథిగా సోనియాగాంధీని ఆహ్వానించనున్నట్లు తెలుస్తోంది. తెలంగాణ ఉద్యమకారులు, కవులు గాయకులతో పాటు అమరవీరుల కుటుంబసభ్యులనుసైతం ఆహ్వానించి వారిని సన్మానించాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందులో భాగంగా తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ను సైతం ఆహ్వానించాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు ప్రచారం సాగుతోంది. తెలంగాణ రాష్ట్ర గీతం జయ జయహే తెలంగాణ పాట రికార్డింగ్ ను ప్రభుత్వ సంగీత దర్శకుడు కీరవాణికి ప్రభుత్వం ఇప్పటికే అప్పగించిన విషయం తెలిసిందే. ఈ పాటను సైతం అదే రోజు ప్రభుత్వం విడుదల చేసే అవకాశం ఉంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత తొలిసారి జరుగుతున్న ఈ వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించాలని రేవంత్ సర్కార్ ప్రణాళిక రూపొందిస్తోంది.

# ఆంధ్రప్రదేశ్ గవర్నర్ శ్రీ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా కురువ చిన్న వీరన్న కు డాక్టరేట్ అవార్డు ప్రదానం.



విభారే న్యూస్. మే 24. ఎమ్మిగనూరు.కర్నూలు జిల్లా గోనెగండ్ల మండలం అల్వాల గ్రామానికి చెందిన చిన్న వీర బ్రహ్మనీ, నాగేశ్వరమ్మ సంతానం మదాసి కురువ చిన్న వీరన్న, చిన్న వయసు నుండే ఉన్నతమైన చదువులు అభ్యసించాలని ఆసక్తి చూపేవారు చదువు పైన ఉన్నటువంటి ఆసక్తితో పదవ తరగతిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దైవందిన్నె గ్రామంలో చదివి పాఠశాలలో మొదటి స్థానాన్ని చేరుకొని అవార్డు పొందడం జరిగింది. అలాగే ఇంటర్ లో సెంట్ మెరిస్ కాలేజీ లో సైన్స్ పై ఉన్నటువంటి ఆసక్తి పై చదివి ప్రధమ స్థానంలో ఉత్తీర్ణత పొందాడు, డిగ్రీని కర్నూలు గవర్నమెంట్ డిగ్రీ కాలేజ్ ఫర్ మెన్ కాలేజీలో పూర్తి చేశారు, తర్వాత ఆళ్లగడ్డ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్మెంట్ సైన్స్ కాలేజీలో మాస్టర్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ ని పూర్తి చేసి సమాజ సేవ చేయాలనే ఉద్దేశంతో కొన్ని రోజులు నెహ్రూ యువజన కేంద్రంలో వాలంటరీగా పని చేయడం జరిగింది తర్వాత స్వచ్ఛంద సంస్థను ఏర్పాటు చేసి యువకులకు అవగాహన సదస్సును ఏర్పాటు చేయడం జరిగింది తర్వాత ఉన్నతమైన చదువు చదవాలని విక్రమ సింహపురి యూనివర్సిటీలో సోషల్ వర్క్ విభాగంలో రెండు సంవత్సరాలు సోషల్ వర్క్ కోర్స్ చేయడం జరిగింది ఇక్కడ యూనివర్సిటీలో ప్రథమ స్థానాన్ని పొంది ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు చేతుల మీదుగా స్వర్ణ పథకంను అందుకోవడం జరిగింది అలాగే ఉత్తమ విద్యార్థిగా మనం 2014 లో మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ప్రతిభ అవార్డు ని అందుకోవడం జరిగింది తర్వాత కొద్ది రోజులు స్వయం ఉపాధి చేస్తూజీవనం సాగించేవారు మళ్ళీ చదువు పైన ఆసక్తి కలిగే పరిశోధన చేయాలనివిక్రమ సింహఎయూనివర్సిటీలో ఫిమేల్ చైల్డ్ లేబర్స్ పైన డాక్టర్ ఏ కుసుమ ఆధ్వర్యంలో పరిశోధనలను పూర్తి చేసి ఆంధ్రప్రదేశ్ గవర్నర్ ఎస్ అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా డాక్టరేట్ పొందడం జరిగింది.

# బూత్ వారీ ఓటింగ్ డేటాను వెబ్ సైట్ లో పెట్టడం కుదరదు: సుప్రీం కోర్టు



న్యూఢిల్లీ:మే 24, పోలింగ్ జరిగిన 48 గంటల్లో ప్రతి పోలింగ్ స్టేషన్ లో ఎన్ని ఓట్లు పోలయ్యాయని బూత్ ఓటర్ల డేటాను ఎన్నికల సంఘం వెబ్ సైట్లో అప్ లోడ్ చేయడం కుదరదని సుప్రీంకోర్టు తేల్చి చెప్పింది. ఎడిఆర్ ఎన్ జివో సంస్థ ఈ విషయమై పెట్టుకున్న అభ్యర్థనను తిరస్కరించింది. ఇప్పటికే ఐదు దశల ఎన్నికలు అయిపోయినందున ఇలాంటి తాత్కాలిక ఆదేశాలు జారీచేయలేమని స్పష్టం చేసింది. న్యాయమూర్తులు దీపాంకర్ దత్త, సతీశ్ చంద్ర శర్మతో కూడిన ధర్మాసనం ఈ తీర్పును వెలువరించింది. బూత్ డేటాను అప్ లోడ్ చేయడం వల్ల ఓటర్లు అయోమయానికి గురికావొచ్చని ఎన్నికల సంఘం కోర్టులో వాదించింది. ఫారమ్ 17సి డేటాను అభ్యర్థి లేదా బూత్ ఏజెంట్ కు మాత్రమే ఇస్తామని ఎన్నికల సంఘం తెలిపింది.

# సంపాదకీయం

శనివారం 25-05-2024

## సామాన్యుడికి ఎన్నికల కష్టాలు

దేశంలో ఎన్నికలు నిష్పాక్షికంగా జరిగేందుకు ఎన్నికల సంఘం రూపొందించిన నిబంధనలనే మనం ఎన్నికల నియమావళి అంటున్నాం. ఎన్నికల షెడ్యూల్ ప్రకటన మొదలు కౌంటింగ్ ముందు వరకు ఈ నియమావళి అమల్లో ఉంటుంది. కోడ్ అమల్లో ఉన్న సందర్భంలో రాజ్యాంగంలోని 324వ అధికరణం ప్రకారం రాజకీయ పార్టీలు, అభ్యర్థులు, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలలో జరిగే పనులను ఎన్నికల సంఘం పర్యవేక్షిస్తుంది. ఈ సమయంలో ప్రభుత్వాలకు కేవలం నామమాత్రపు అధికారాలే ఉంటాయి. ఎన్నికల నిర్వహణ సాఫీగా, పారదర్శకంగా జరిగేందుకు తగిన ఏర్పాట్లు జరగాల్సిందే గానీ, ఎన్నికలు ముగిసిన తర్వాత కూడా సుదీర్ఘకాలం పాటు ఎన్నికల కోడ్ అమల్లో ఉండటం వల్ల అటు ప్రభుత్వాలకు, ఇటు సామాన్యులకు ఇబ్బంది ఎదురవుతోంది.ఎన్నికల నియమావళి ప్రకారం మద్యం, నగదు పంపిణీ, ఆస్తుల విధ్వంసం, ఫేక్ న్యూస్ ప్రచారం చేయటం, ఓటర్లను భయపెట్టటం, రెచ్చగొట్టే ప్రసంగాలు, అనుచిత వ్యాఖ్యలు , నేతల అన్ పార్లమెంటరీ భాష, కులం, మతం ప్రాతిపదికన ఓట్లు అడగడం, ఆయుధాల ప్రదర్శన, భయపెట్టడం, నిరాధార ఆరోపణలు చేయడం, అధికార పార్టీలో ఉన్నవారు ప్రభుత్వ యంత్రాంగాన్ని దుర్వినియోగం చేయటం కుదరదు. అయితే, ఈ నిషేధాలు వాస్తవంగా అమలవుతున్నాయా? అంటే లేదనే జవాబే వస్తోంది. సాక్షాత్తూ దేశ ప్రధాని మతం పేరుతో ఓటర్ల మధ్య చీలిక తెచ్చే ప్రయత్నం చేసినా, ఎన్నికల సంఘం మందలిస్తూ, నోటీసులకే పరిమితం అయింది.ప్రస్తుతం మన దేశంలో ఏడు దశల్లో సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో నాలుగో దశలో మే 13వ తేదీన తెలంగాణలో ఎన్నికలు పూర్తయ్యాయి. అంటే.. ఎన్నికలు జరిగి పదిరోజులు పూర్తి కాగా, మరో 10 రోజుల పాటు ఎన్నికల కోడ్ ఇక్కడ అమలులో ఉండనుంది. ఇదే సమయంలో ఖరీఫ్ సీజన్ మొదలు కానుంది. తెలంగాణలో కురిసిన అకాల వర్షాలతో రైతన్నలకు అపారం నష్టం జరిగింది. కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం నీటి పాలైంది. మరోవైపు నగరాల్లో వర్షాకాలంలో వచ్చే సమస్యలను ఎదుర్కొనేందుకు అధికార యంత్రాగం క్షేత్ర స్థాయిలో అనేక పెండింగ్ పనులు చేయాల్సి ఉంది. ఇక.. మరో రెండు వారాల్లో వేసవి సెలవుల అనంతరం రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం పాఠశాలలన్నీ తెరుచుకోనున్నాయి. కోడ్ కారణంగా టీచర్లు, విద్యార్థులకు సంబంధించిన ఏ రకమైన నిర్ణయాలూ తీసుకునే అవకాశం లేకుండా పోయింది. ఒకవేళ, ఇక్కడి ముఖ్యమంత్రి పై అంశాల మీద ఏదైనా నిర్ణయాలు తీసుకుంటే, దానివల్ల ఆంధ్రప్రదేశ్, తదితర పొరుగు రాష్ట్రాల ఓటింగ్ సరళిని ప్రభావితం చేస్తాయని ప్రశ్న తలెత్తినా.. ఇప్పటికే దక్షిణాది రాష్ట్రాల్లో ఐదో విడతలోనే ఎన్నికలు పూర్తయిపోయాయి కనుక ఆ ప్రశ్న కూడా ఉత్పన్నం అయ్యే అవకాశమే లేదుమరోవైపు, నియమావళిలో భాగంగా ఎన్నికల వేళ ఏర్పాటు చేసిన చెక్ పోస్టుల్లోని సిబ్బంది తనిఖీల పేరుతో సామాన్యులను ఇబ్బంది పెడుతున్నారు. ఈ సందర్భంగా ఆసుపత్రులకు, విద్యాసంస్థలకు ఫీజు రూపంలో చెల్లించేందుకు రూ.50 వేలకు మించి నగదు తీసుకుపోతున్న వారికి ఈ తనిఖీలు తలనొప్పిగా మారుతున్నాయి. బ్యాంకు నుంచి విత్‌డ్రా చేసినట్లుగా రసీదు వంటివి లేదని నగదును, ఏదైనా శుభకార్యాలకి బయలుదేరిన వారి వద్ద నగలను సీజ్ చేయటం జరగుతోంది. ఈ నగదును, బంగారాన్ని సీజ్ చేసి కోర్టుకు స్వాధీన పరచటంతో తిరిగి, వాటిని ఆధారాలు చూపి తీసుకోవాలసి రావటం సామాన్యులకు ఇబ్బందిగా మారింది.అసెంబ్లీ ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ గెలిచి, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. అయితే, కొత్త ప్రభుత్వం ఇల్లు సర్దుకోకముందే సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ రావటం, ఈ రెండు నెలల పాటు ఎన్నికల కోసం సమయం కేటాయించాల్సి రావటంతో నూతన ప్రభుత్వం తలపెట్టిన అనేక పనులు పెండింగ్‌లో పడిపోయాయి. ముఖ్యంగా అసెంబ్లీ ఎన్నికల వేళ కాంగ్రెస్ ఇచ్చిన హామీలను ఎన్నికల కోడ్ కారణంగా నేటికీ ప్రభుత్వం అమలుచేయలేని పరిస్థితి. ఒకవైపు ఖరీఫ్ సీజన్ రావటంతో వీలున్నంత త్వరగా రైతు రుణమాఫీ చేయాలని ప్రభుత్వం భావిస్తున్నా.. ముందడుగు వేయలేని దుస్థితి. మరోవైపు, రైతులకు కొత్తగా రుణాలు అందించేందుకు బ్యాంకర్లతో ప్రభుత్వం చర్చించాల్సి ఉంది. ఇన్నిపనులు పెండింగ్‌లో ఉన్నా, ప్రభుత్వం నేరుగా ఏ నిర్ణయమూ చేయలేని పరిస్థితి. చివరికి తెలంగాణ ప్రభుత్వం అధికారికంగా మంత్రిమండలి సమావేశం నిర్వహించుకోవటానికీ ఈ నియమావళి అడ్డంకిగా మారింది. దీంతో ప్రభుత్వం సమీక్షా సమావేశాలు నిర్వహించాల్సి వస్తోంది. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాల విధినిర్వహణకు అడ్డంకిగా మారిన నియమావళి మీద పున:సమీక్ష చేయాలని, అదే సమయంలో కోడ్ కారణంగా ఆయా విభాగాల పనులు పెండింగ్‌లో పెట్టి ప్రజలను ఇబ్బందులు పాలు చేయకుండా, సదరు విభాగాధిపతులు తమకున్న పరిమితుల మేరకు పాలనా సంబంధిత అంశాల అమలును తమ బాధ్యతను స్వీకరించాలని మేధావులు కోరుతున్నారు.

# అక్రమ కేసులకు భయపడే ప్రసక్తే లేదు : వై.సతీష్ రెడ్డి




హైదరాబాద్ : బీఆర్ఎస్ పార్టీ నాయకులపై, కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టడమే ఎజెండాగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోంది. ప్రశ్నించిన వారిని లక్ష్యంగా చేసుకుని అక్రమ కేసులు బనాయిస్తున్నది. అక్రమ కేసులకు భయపడే ప్రసక్తేలేదని బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ వై. సతీష్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన మొదటి రోజు నుంచి నేటి వరకు ఈ పరంపర కొనసాగిస్తున్నదని విమర్శించారు.అధికారంలోకి వచ్చీ రాగానే డిసెంబర్ 4నే హుజురాబాద్ లో రావుల భరత్ రెడ్డి అనే బీఆర్ఎస్ కార్యకర్తపై కేసు పెట్టారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డిపై లాఠీచార్జ్‌కి నిరసనగా సోషల్ మీడియాలో పోస్టు పెట్టినందుకు అతనిపై ఓ పోలీసు ఫిర్యాదు చేస్తే కేసు పెట్టారు. అలాగే.. డిసెంబర్‌లో పంటలు ఎండిపోతున్నాయి. కాలువల్లో నీళ్లు రావడం లేదని ప్రశ్నించినందుకు తుంగతుర్తికి చెందిన సురేష్ యాదవ్ పై డిసెంబర్ 20న దాడి చేసి విచక్షణారహితంగా కొట్టి, అట్రాసిటీ కేసు పెట్టారు.ప్రభుత్వాన్ని విమర్శించాడని కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం పచ్చునూర్ కు చెందిన పిట్టల శ్రవణ్ పై సైబర్ క్రైమ్ పోలీసులు మార్చి 5న కేసు పెట్టారు. మార్చి 15న పంటలు ఎండుతున్నాయని ఎండిన పంటల వీడియో తీసి రైతులతో మాట్లాడించి సోషల్ మీడియాలో పెట్టిన ధర్మపురికి చెందిన సల్వాజీ మాధవరావుపై దాడి చేశారు. పైగా అతనిపైనే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టి జైలుకు పంపించారని గుర్తు చేశారు.ఓయూలో నీరు, కరెంటు కొరత ఉందంటూ సెలవులు ప్రకటిస్తూ హాస్టల్ వార్డెన్ ఇచ్చిన సర్క్యులర్ ను సోషల్ మీడియాలో పెట్టినందుకు మే 1వ తేదీన బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ క్రిషాంక్, ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి నాగేందర్ పై కేసు పెట్టారు. జైలుకు పంపించారు. ఆ తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా తన సోషల్ మీడియాలో ఫేక్ సర్క్యులర్ ని పోస్ట్ చేశారు. అయినా ఆయనపై ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. కొణతం దిలీప్, హరీష్ రెడ్డిపై కేసు నమోదు చేశారు. ఇలా అనేక మందిపై కేసులు పెట్టారని మండిపడ్డారు.రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ ఆనవాళ్లు లేకుండా చేస్తానని చెప్పిన రేవంత్ రెడ్డి ఆ ప్రయత్నాల్లో భాగంగానే ఇవన్నీ చేస్తున్నారని ఆరోపించారు. కేసులకు భయపడి ప్రభుత్వ తప్పులను ఎత్తిచూపడం ఆపేస్తారని రేవంత్ రెడ్డి భావిస్తున్నట్టున్నారు. కానీ, మేమంతా కేసీఆర్ గారు తయారు చేసిన సైనికులం, ఉద్యమం చేసి లాఠీ దెబ్బలు తిని, తూటాలకు ఎదురెల్లినోళ్లం. ఇలాంటి పిట్ట బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. ఎవరికి అధికారం శాశ్వతం కాదు అని ఈ కాంగ్రెస్ ప్రభుత్వం గుర్తుంచుకోవాలని హితవు పలికారు.

# భద్రాచలంలో నర్సింగ్ విద్యార్థిని అనుమానాస్పద మృతి..

**కాలేజీ యాజమన్యంపై డౌట్! నిరసన చేపట్టిన విద్యార్థులు**



భద్రాచలం, మే 24: భద్రాచలంలోని మారుతీ నర్సింగ్ కళాశాలలో నర్సింగ్ విద్యార్థిని అనుమానాస్పద రీతిలో గురువారం (మే 23) మృతి చెందింది. నర్సింగ్ ఫస్ట్ ఇయర్ చదువుతున్న పి కారుణ్య (18) భద్రాచలం ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందింది.సిద్దికినగర్‌లో నివాసముంటున్న విద్యార్థిని కారుణ్య గురువారం ఉదయం హాస్టల్ గది నేలపై అపస్మార స్థితిలో పడి ఉంది. కారుణ్యను గమనించిన ఆమె స్నేహితులు ఆస్పత్రికి తరలించారు. అయితే అక్కడ చికిత్స పొందుతూ గురువారం సాయంత్రం కారుణ్య మృతి చెందింది. కారుణ్య శరీరంపై గాయాలు ఉండటంతో విద్యార్థి మృతిపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. హాస్టల్‌లో గుర్తుతెలియని వ్యక్తులు ఆమెపై దాడి చేశారని స్థానికులు ఆరోపిస్తున్నారు.అయితే ప్రేమ వ్యవహారమే ఈ ఘటనకు కారణమని కొందరు విద్యార్థులు చెబుతున్నారు. ఓ వ్యక్తి హాస్టల్‌కు వచ్చి కారుణ్యతో గొడవ పడి ఆమెపై దాడి చేసి పారిపోయాడని కొందరు విద్యార్థులు తెలిపారు. మరోవైపు కారుణ్య బాత్‌రూమ్‌లో జారిపడిందని, దీంతో అంతర్గతంగా గాయాలయ్యాయని నర్సింగ్ కాలేజీ యాజమాన్యం పేర్కొంది. ఇలా పొంతనలేని విధంగా ఎవరికి తోచిన రీతిలో వారు చెబుతుండటంతో నర్సింగ్ విద్యార్థిని కారుణ్య మృతి మిస్టరీగా మారింది. దీనిపై కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యా?ప్తు చేపట్టారు. విచారణ తర్వాత అసలు కారణం తెలిసే అవకాశం ఉందని ఓ పోలీస్ అధికారి తెలిపారు. మరోవైపు శుక్రవారం ఆసుపత్రి వద్దకు చేరుకున్న మృతురాలి తల్లిదండ్రులు, బంధువులు కళాశాల యాజమన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ఇందుకు నిరసనగా భద్రాచలం పారా మెడికల్ కళాశాల వద్ద విద్యార్థులు, బంధువులు పెద్ద ఎత్తున నిరసనకు దిగారు. దీంతో ఇక్కడ ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. వారంతా ప్రభుత్వాసుపత్రి నుంచి ర్యాలీగా కళాశాల వద్దకు చేరుకున్నారు. కారుణ్య కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కళాశాలకు వచ్చిన ఛైర్మన్‌పై విద్యార్థులు, బంధువులు దాడికి యత్నించగా పోలీసులు వారిని అడ్డుకున్నారు.

# అదిరిపోయే శుభవార్త.. భారీగా తగ్గిన బంగారం ధర.. తులం గోల్డ్ ఎంతో తెలుసా?

ఢిల్లీ : బంగారం ధర తగ్గుతుందా అని ఎదురు చూస్తున్న వారికి శుభవార్త. మే 24 శుక్రవారం రోజున బంగారం ధర భారీగా తగ్గింది. రికార్డు స్థాయిలో దూసుకుపోయిన బంగారం ధరలకు బ్రేక్ పడింది.గత కొద్ది రోజులతో పోలిస్తే బంగారం ధర తగ్గింది. మీరు బంగారం కొనాలని ఆలోచిస్తున్నట్లయితే, మీరు ఈరోజు నగల దుకాణానికి వెళ్లొచ్చు. దేశవ్యాప్తంగా పసిడి ధరలు భారీగా తగ్గాయి. ఢిల్లీ బులియన్ మార్కెట్లో అయితే ఏకంగా తులం గోల్డ్ ధర రూ.1,050 దిగింది. దీంతో తులం పుత్తడి ధర రూ.73,550కి దిగొచ్చింది. ధరలు తగ్గడం వరుసగా రెండోరోజు కావడం విశేషం. ఇది పసిడి ప్రియులకు సంతోషానిచ్చింది. ఇక దేశంలోని వివిధ పట్టణాలు, నగాల్లో బంగారం, వెండి ధరలు ఎలా ఉన్నాయో ఇక్కడ తెలుసుకుందాం.. 22 క్యారెట్ల బంగారం ధర..నేడు 1 గ్రాము బంగారం ధర రూ.6,729 ఉంది. 8 గ్రాముల బంగారం కొనుగోలు చేస్తే రూ.53,832లకే వస్తుంది.10 గ్రాముల బంగారం 67,290 ఉంది.100 గ్రాముల బంగారం కొనడానికి 6,72,900లకు లభిస్తుంది.24 క్యారెట్ల బంగారం ధర..24 క్యారెట్ల బంగారం గ్రాముకు 7,341గా ఉంది. 8 గ్రాముల బంగారం కొనుగోలు చేస్తే 58,728. కాగా, ఈరోజు 10 గ్రాముల బంగారం ధర రూ.73,410. 100 గ్రాముల బంగారం ధర రూ.7,34,200 ఉంది. చెన్నైలో 22 క్యారెట్ల బంగారం ధర రూ.6,749. 24 క్యారెట్లకు 7,363 ఉంది. ముంబైలో 22 క్యారెట్ల బంగారం ధర రూ.6,729గా ఉంది. 24 క్యారెట్లకు 7,342 ఉంది. ఢిల్లీలో 22 క్యారెట్ల బంగారం ధర రూ.6,744. 24 క్యారెట్లకు 7,356. కోల్‌కతాలో 22 క్యారెట్ల బంగారం ధర రూ.6,729. 24 క్యారెట్లకు 7,341 ఉంది. హైదరాబాద్‌లో 22 క్యారెట్ల బంగారం ధర రూ.6,729. ఐతే 24 క్యారెట్లకు రూ.7,341 ఉంది. కేరళలో 22 క్యారెట్ల బంగారం ధర రూ.6,729. 24 క్యారెట్లకు 7,341గా ఉంది.ఇక దేశంలోని వివిధ నగరాలు, .పసిడితో పాటుగానే, గత కొన్ని రోజులుగా రికార్డు స్థాయిలో దూసుకుపోయిన వెండి ధరలు కూడా తగ్గుముఖం పట్టాయి. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి డిమాండ్ పడిపోవడంతో కిలో వెండి ధరలు కూడా పడిపోతున్నాయని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి.

# ప్రశ్నించే గొంతుక రాకేష్ రెడ్డిని గెలిపించాలి : ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి



సూర్యాపేట : ఎమ్మెల్సీ ఎన్నికల్లో పట్టభద్రులు ఆలోచించి బీఆర్ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేష్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని సూర్యాపేట ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి అన్నారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా కోర్టుల ఆవరణలో బార్ అసోసియేషన్ న్యాయవాదులను పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటు అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు తుంగలో తొక్కి గత ప్రభుత్వ పథకాలను కూడా కొనసాగించడం లేదని విమర్శించారు.తొమ్మిదేళ్ల పాలనలో ప్రతి ఒక్కరిని ఆదుకున్న ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌ది అన్నారు. రాష్ట్రంలో ఐదు నెలలు అధికారంలో ఉండి విద్యుత్ నిర్వహణను ఆగం చేశారని విమర్శించారు. నిరుద్యోగ భృతి హామీ ఇవ్వలేదని దాటవేస్తున్నారు. రైతు పండించిన పంటకు బోనస్ కూడా ఇవ్వడం లేదని మండిపడ్డారు. ఓటు వేస్తున్నామంటే మన గొంతును అభ్యర్థికి ఇస్తున్నట్లేనని స్పష్టం చేశారు. ప్రశ్నించే గొంతు ప్రశంసించే గొంతుగా మారిందని, అందుకే ప్రశ్నించే గొంతుక ఏనుగుల రాకేష్ రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

# తెలంగాణ గ్రూప్-1 ప్రిలిమ్స్ అభ్యర్థులకు టీజీపీఎస్సీ కీలక అప్‌డేట్..

**ఈ తప్పులు చేశారో పరీక్ష కేంద్రాల్లోకి నో ఎంట్రీ!**

హైదరాబాద్ మే 24: తెలంగాణలో 563 గ్రూప్ 1 పోస్టుల భర్తీ కోసం నిర్వహించనున్న ప్రిలిమినరీ పరీక్ష కోసం టీజీపీఎస్సీ పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తోంది.జూన్ 9వ తేదీన ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఈ పరీక్ష ఆఫ్‌లైన్ విధానంలో జరగనుంది. గతంలో రెండు సార్లు గ్రూప్ 1 పరీక్ష నిర్వహించడంలో టీజీపీఎస్సీ విఫలం అయ్యింది. దీంతో ఈసారి ఎలాంటి పొరబాట్లు జరగకుండా పకడ్బందీగా నిర్వహించాలని కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేస్తోంది. 2022లో ఇచ్చిన గ్రూప్1 నోటిఫికేషన్ రద్దు చేసిన రేవతంత్ సర్కార్.. 563 ఉద్యోగాలతో ఈ ఏడాది ఫిబ్రవరిలో కొత్త నోటిఫికేషన్ జారీ చేసిన సంగతి తెలిసిందే. రాష్ట్ర వ్యాప్తంగా 4.03 లక్షల మంది అభ్యర్థులు ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకున్నారు. గతంలో ప్రశ్నపత్రాల లీకేజీ, పరీక్ష నిర్వహణలో లోపాల కారణంగా న్యాయవివాదాలు తలెత్తడంతో ప్రిలిమ్స్ రద్దయింది. ఈసారి మాత్రం ఎలాంటి అవకతవకలు చోటు చేసుకోకుండా చర్యలు తీసుకోవాలని, నిబంధనలు పాటించడంలో అభ్యర్థులు, సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని కమిషన్ నిర్ణయించింది.

ఓఎంఆర్ పద్ధతిలో ప్రిలిమ్స్..4 లక్షలకుపైగా దరఖాస్తులు రావడంతో తొలుత ఆన్‌లైన్‌లో ఈ పరీక్ష నిర్వహించాలని భావించినప్పటికీ.. ఇంత మందికి ఆన్‌లైన్‌లో నిర్వహించడం సాధ్యంకాదని టీఎస్పీయస్సీ భావించింది. సీబీఆర్టీ విధానంలో అయితే సెషన్ల వారీగా పరీక్షలు నిర్వహించాల్సి రావడంతో.. ఒక్కరోజులోనే పరీక్షను పూర్తి చేసేందుకు ప్రిలిమ్స్‌ను ఓఎంఆర్ పద్ధతిలో నిర్వహించాలని టీజీపీఎస్సీ నిర్ణయించింది. ఇక గ్రూప్ 1 ప్రిలిమ్స్ హాల్‌టికెట్లు జూన్ 1 నుంచి వెబ్‌సైట్లో అందుబాటులో ఉంచనుంది. ప్రిలిమ్స్ అనంతరం మెయిన్ పరీక్షలు అక్టోబరు 21న ప్రారంభంకానున్నాయి. మెయిన్ పరీక్షలు మొత్తం 7 పేపర్లకు జరుగుతాయి. ప్రిలిమినరీ పరీక్షలో జోన్లవారీగా పోస్టుల సంఖ్యకు అనుగుణంగా 1:50 నిష్పత్తిలో మెయన్ పరీక్షకు ఎంపిక చేస్తారు. ఆ తర్వాత రిజర్వ్‌డ్ వర్గాలవారీగా 1:50 నిష్పత్తిలో తీసుకుంటారు. రిజర్వ్‌డ్ వర్గాల్లో అభ్యర్థుల సంఖ్య తక్కువైతే మెరిట్ ఆధారంగా ఎంపిక చేస్తామని టీజీపీఎస్సీ కార్యదర్శి నవీన్ నికోలస్ తెలిపారు. ఈ సందర్భంగా గ్రూప్ 1 అభ్యర్థులకు ముఖ్య సూచనలు జారీ చేశారు.

అభ్యర్థులకు ముఖ్య సూచనలు..

గ్రూప్ 1 పరీక్ష సమయంలో వేలిముద్ర, ఫొటో బయోమెట్రిక్ తప్పనిసరిగా ఇవ్వాలని, ఇవ్వనివారిని అనర్హులుగా ప్రకటిస్తారు.

అభ్యర్థులు పరీక్ష రోజు హాల్‌టికెట్ నంబరు, ఫొటో, పేరు, తండ్రి, తల్లి పేర్లు, పుట్టిన తేదీ, పరీక్ష కేంద్రం, జెండర్ వివరాలను ముద్రించిన ఓఎంఆర్ జవాబుపత్రం అందిస్తారు. ఇందులో ఏవైనా తప్పులుంటే వెంటనే ఇన్విజిలేటర్ దృష్టికి తీసుకెళ్లాలి. అప్పుడు వారు సాదా ఓఎంఆర్ పత్రాన్ని పొందాలి.

జవాబుపత్రంలో జవాబులు గుర్తించేందుకు బ్లూ లేదా బ్లాక్ పెన్ను ఉపయోగించాలి.

పరీక్ష పూర్తయిన తరువాత జవాబు పత్రాలను స్కానింగ్ చేసి, అభ్యర్థుల డిజిటల్ కాపీలు వెబ్‌సైట్లో పొందుపరుస్తారు.

హాల్‌టికెట్‌తో పాటు అభ్యర్థులు పరీక్ష కేంద్రానికి ప్రభుత్వం జారీ చేసిన ఏదైనా గుర్తింపు కార్డు అంటే పాస్‌పోర్టు, పాన్ కార్డు, ఓటర్ కార్డు, ఆధార్ కార్డు, ప్రభుత్వ గుర్తింపు కార్డు, డ్రైవింగ్ లైసెన్సు ఒరిజినల్ తీసుకురావాలి.

పరీక్షకేంద్రానికి ఉదయం 9 గంటలకు చేరుకోవాలి. పరీక్ష కేంద్రం



# తడబాటులో వైసీపీ...

విజయవాడ, మే 24  ఆంధ్రప్రదేశ్ లో పోలింగ్ ముగిసింది. అగ్రనేతలు రెస్ట్ మోడ్‌లో ఉన్నారు. కానీ రాజకీయాలు మాత్రం హైవోల్టేజ్ లో సాగుతున్నాయి. ముఖ్యంగా మాచర్ల నియోజకవర్గ రాజకీయాలు రోజు రోజుకు కీలక మలుపులు తిరుగుతున్నాయి. ఇవి నియోజకవర్గానికి పరిమితం కావడం లేదు. మొత్తం రాష్ట్ర రాజకీయాల చుట్టూ తిరిగేలా చేస్తున్నాయి. పోలింగ్ రోజున ఓ పోలింగ్ బూత్ లో ఈవీఎంను పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పగులగొట్టిన దృశ్యాలు వెలుగులోకి వచ్చాయి. ఆ దృశ్యాల చుట్టూ రాజకీయం ముదిరిపోయింది. అప్పటికే అల్లర్ల అంశంపై సిట్ విచారణ జరుగుతూండటం, పిన్నెల్లి సోదరులు అజ్ఞాతంలోకి వెళ్లారన్న ప్రచారం జరగడంతో అసలు రాజకీయం ప్రారంభమయింది. ఈవీఎం పగులగొడుతున్న దృశ్యాలు జాతీయ మీడియాలో సైతం వైరల్  కావడంతో ఈసీ తక్షణం స్పందించి చర్యలు తీసుకోవాల్సిందేనని నోటీసులు పంపింది. దీంతో పిన్నెల్లిని తప్పనిసరిగా అదుబులోకి తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. పిన్నెల్లి రామకృష్ణారెడ్డి కొద్ది రోజుల నుంచి రెండు, మూడు చానళ్లకు చెందిన మీడియా ప్రతినిధులకు తప్ప ఎవరికీ అందుబాటులో లేరు. మాచర్ల అల్లర్ల విషయంలో ఆయనను అరెస్టు చేయవచ్చన్న అభిప్రాయం బలంగా ఉండటంతో ముందస్తు జాగ్రత్తగా ఆయన హైదరాబాద్ లో ఉంటున్నారు. ఈ కేసుల్లో ఆయనను అరెస్టు చేస్తారని ఎవరూ అనుకోలేదు. కానీ హఠాత్తుగా ఈవీఎంల ధ్వంసం వీడియో వెలుగులోకి రావడం.. అది సంచలనంగా మారడంతో  పోలీసులు సైతం తీవ్ర ఒత్తిడికి లోనయ్యారు. ఉదయమే ఆయనను అరెస్ట్ చేయడానికి ప్రత్యేక బృందాలుగా ఏర్పడి హైదరాబాద్ కు వెళ్లారు. మామూలుగా అయితే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఇంట్లోనే సరెండర్ అవ్వాల్సింది. ప్రతి రాజకీయ నాయకుడు చేసే పని అది. పారిపోయే ప్రయత్నం అసలు చేయరు. ఏ ఒక్క రాజకీయ నాయకుడు కూడా పరారీలో ఉన్నారు అని అనిపించుకోవడానికి ఇష్టపడరు. కనీసం అజ్ఞాతం అనే గౌరవ ప్రమాదమైన మాట వరకూ వెళ్తారు. కానీ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి వ్యవహారం



పరారీ వరకూ వెళ్లింది. బుధవారం అంతా పిన్నెల్లి అరెస్టు విషయం థ్రిల్లర్ తరహాలో సాగింది.  మొదట పిన్నెల్లి కార్లు పట్టుకున్నారు. తర్వాత ఆయనను చేజింగ్ చేస్తున్నట్లుగా వీడియోలు వైరల్ అయ్?యయి.  తర్వాత అరెస్ట్ చేశారని మీడియాకు లీక్ వచ్చింది. చివరికి డీజీపీ హరీష్ కమార్ గుప్తా త్వరలో అరెస్టు చేస్తామని ఈసీకీ నివేదిక పంపారు.  ఐదు గంటల కల్లా అరెస్ట్ చేసి నివేదిక సమర్పించాలని ఆదేశించిన సీఈసీకి అరెస్టు చేశామన్న నివేదికను పంపలేకపోయారు.  లుకౌట్ నోటీసులు జారీ చేసినందున విదేశాలకు పోయే చాన్స్ లేదు.  పిన్నెల్లిపై పది సెక్షన్ల కింద కేసులు పెట్టామని ఆయనకు ఏడేళ్ల జైలు శిక్ష పడుతుందని సీఈవో మీనా చెప్పారు. మొత్తంగా రోజంతా హైడ్రామా నడిచింది. పరారీ అవుతుంటే పట్టుకున్నామని పోలీసులు చెప్పడం ఎవరికైనా ఎబ్బెట్టుగా ఉంటుంది. రాజకీయ నాయకులకు అయితే ఇంకా ఎక్కువ ఎబ్బెట్టుగా ఉంటుంది. అందుకే పోలీసులు తమ దాకా వస్తే ఎప్పుడూ వారిని తప్పిచుకుని పోవాలనిరాజకీయ నేతలు అనుకోరు. అరెస్టు కావడానికే ప్రాధాన్యం ఇస్తారు. తాము తప్పు చేయలేదని న్యాయపోరాటం చేస్తారు. ఇక్కడ పిన్నెల్లి కూడా అదే చేస్తారని అనుకున్నారు.కానీ ఆయన అనూహ్యంగా పరారీ బాట పట్టారు. ఎంతగా అంటే విదేశాలకు వెళ్లిపోతాడని. అంత అవసరం ఏముందో వైసీపీ క్యాడర్ కూడా అర్థం కాదు. ఎన్నికల సమయంలో గొడవల కేసులు కఠినంగా కనిపిస్తాయి కానీ.. అవి సులువుగా తేలిపోతాయి. ఈవీఎం ధ్వంసం కేసులో మ్యాగ్జిమం శిక్ష రెండు నుంచి మూడేళ్ల జైలు శిక్ష. ఏడేళ్ల లోపు జైలు శిక్ష పడే కేసుల విషయంలో అరెస్టులు ఉండవు. స్టేషన్ బెయిల్ ఇస్తారు. కానీ న్యాయపరమైన అంశాల గురించి పూర్తి స్థాయిలో ప్రయత్నాలు చేయకుండా పిన్నెల్లి పరారీ కావడం తీవ్రతను ఆటోమేటిక్ గా పెంచిందని అనుకోవచ్చు. పిన్నెల్లిని సమర్థించడానికి కూడా వైసీపీ నేతలు తంటాలు పడ్డారు. వీడియో బయటకు వచ్చిన తర్వాత రిగ్గింగ్ చేశారని పగుల గొట్టారని ఎక్కువ మంది వాదిస్తూ తెర ముందుకు వచ్చారు. పిన్నెల్లి పారిపోయాడని.. పట్టుకోలేకపోయామని పోలీసులు చెప్పిన తర్వాత గురజాల ఎమ్మెల్యే ప్రెస్ మీట్ పెట్టి పిన్నెల్లికి మద్దతుగా పార్టీ తరపున బలమైన వాదన వినిపించే  ప్రయత్నం చేశారు. అది మరీ అరెస్టు చేయాల్సింత కేసు కాదని ఆయన చెప్పదల్చుకున్నారు. కానీ చెప్పే విషయంలో తేడా రావడం.. అప్పటికే పిన్నెల్లి పారిపోయారని ఉద్ధృతంగా ప్రచారం జరగడంతో కాసు మహేష్ రెడ్డి వాదన కూడాచాలా మందికి వింతగా అనిపించింది. అలాగే  మంత్రి అంబటి రాంబాబు ఆ వీడియో ఫేక్ కావొచ్చునని వాదించి మరింత విమర్శలకు గురయ్యేలా చేశారు. పిన్నెల్లి న్యాయపరమైన అవకాశాలను వెదుక్కుని ఉంటే.. వైసీపీకి ఎదురుదాడి చేయడానికి అవకాశం ఉండేది. కానీ పరారు కావడం వల్ల ఎలాంటి వాదన వినిపించినా ప్రజల్లోకి మాత్రం భిన్నంగా వెళ్తోంది. పార్టీ ముఖ్య నేతలందరూ హాలీడే మూడ్ లో ఉండటంతో పిన్నెల్లి ఇష్యూని సరిగ్గా డీల్ చేయలేకపోయినట్లుగా మారింది వైసీపీ పరిస్థితి. ఇప్పుడు తప్పు దిద్దుకోవాలంటే చాలా కష్టపడాల్సి ఉంటుందని రాజకీయవర్గాలు అంచనా వేస్తున్నాయి.

## సోషల్ మీడియాను షేక్ చేస్తున్న పిన్నెల్లి

గుంటూరు, మే 24  తెలుగు రాష్ట్రాల్లో ఇప్పుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి వ్యవహారం హాట్‌టాపిక్‌గావ మారుతోంది. ఆయన ఎక్కడున్నారు? ఆయనను ఎందుకు అరెస్టు చేయలేదు? ఆయన తప్పించుకున్నారా? లేకుంటే పోలీసులే తప్పిస్తున్నారా? ఇలా చాలా రకాల ప్రశ్నలు ఎదురవుతున్నాయి. అయితే మాచర్ల రావాలంటే నాకు ఎంతసేపు? రావాలంటే ఇట్టే రాగలను అంటూ పిన్నెల్లి ప్రకటనలు చేస్తున్నారు.పోకిరి సినిమాలో విలన్ మాదిరిగా గంట గంటకు లీకులు వదులుతున్నారు. ఈ క్రమం లో పిన్నెల్లి రామకృష్ణారెడ్డి పై సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున ట్రోల్ జరుగుతోంది. ఇంకెన్ని వెబ్ సిరీస్ లు విడుదలవుతాయోనని ఆసక్తికర చర్చ అయితే నడుస్తోంది.పోలింగ్ నాడు మాచర్లలో విధ్వంసకర ఘటనలుజరిగాయి. దర్యాప్తు లో భాగంగా వారు పోలింగ్ కేంద్రా ల్లో సీసీ ఫుటేజీలను పరిశీలించగా.. ఓ కేంద్రంలో పిన్నెల్లి రామకృష్ణారెడ్డి జరిపిన విధ్వంసం వెలుగులోకి వచ్చింది.

# తాడిపత్రిలో మంటలు ఆర్పేదెవరు

అనంతపురం, మే 24 , మాచర్ల నియోజకవర్గంలో కేసులు నమోదయ్యాయి. పల్నాడులో అనేక ఘర్షణలు చోటు చేసుకున్నాయి. కేవలం పల్నాడు మాత్రమే కాదు.. తాడిపత్రిలోనూ ఇదే తరహాలో ఘటనలు జరిగాయి. వైసీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే పెద్దారెడ్డి, మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్ రెడ్డిల మధ్య ఆధిపత్య పోరు సాగుతోంది. అక్కడ కూడా పెద్దయెత్తున ఘర్షణలు చెలరేగాయి. అయితే అక్కడ కూడా పోలీసులు ఇద్దరిపై కేసులు నమోదు చేశారు. ఎమ్మెల్యే పెద్దారెడ్డిపైనా, మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్ రెడ్డి, ఆయన కుమారుడు అస్మిత్ రెడ్డిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే వారిని ఇంతవరకూ అదుపులోకి తీసుకోలేదు. మాచర్లలో ఈవీఎంలు ధ్వంసం చేశారన్న కారణంతో పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని అరెస్ట్ చేయాలని కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశించడంతోనే ఆయనకోసం వేట మొదలుపెట్టారు. కానీ తాడిపత్రిలో అలా కాదు. ఇద్దరు పెద్దమనుషులను గౌరవంగా ఇతర ప్రాంతాలకు పోలీసులే తరలించారు. ఎందుకు వారిని అరెస్టు చేయలేదన్న ప్రశ్నలు సహజంగానే తలెత్తుతున్నాయి. కౌంటింగ్ సమయంలో తిరిగి ఘర్షణలు చెలరేగే అవకాశముందని నిఘా వర్గాలు హెచ్చరించినా వారిని గృహనిర్భంధానికే పరిమితం చేశారు. జేసీ ప్రభాకర్ రెడ్డి ఆయన కుమారుడు అస్మిత్ రెడ్డిలను పోలీసులే దగ్గరుండి హైదరాబాద్ లో వదిలేసి వెళ్లిపోయారు. నిజానికి పల్నాడు కు మించి తాడిపత్రిలో కౌంటింగ్ రోజు ఘర్షణలు తలెత్తే అవకాశముందని ఇంటలిజెన్స్ నివేదికలు చెబుతున్నాయి. అక్కడ అదనపు బలగాలను కూడా ముందుగానే దించారు. పోలీసులు పెద్దయెత్తున మొహరించారు. కానీ అక్కడి ఘర్షణలు నివారించడానికి ఈ బలగాలు సరిపోతాయా? అన్నదే అసలు ప్రశ్న. గ్రామాల్లో ఇప్పటికీ సమయం కోసం రెండు వర్గాలు వేచి ఉన్నాయి. వారి మధ్య అడ్డుగోడ నిర్మించాలంటే ఇప్పటికిప్పుడు సాధ్యం కాదు. అదే ఇప్పుడు పోలీసు వర్గాల్లో కూడా ఆందోళన చెందుతున్న విషయం. గెలుపోటములు పక్కన పెట్టి మరీ గొడవలకు దిగడం అక్కడ సాధారణం కావడంతో పోలీసులు నిరంతరం నిఘా ఉంచాలి. నేతల ఫోన్ల దగ్గర నుంచి వారి ప్రధాన అనుచరుల కదలికలను ఎప్పటికప్పుడు గమనించాలంటూ ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు అందినట్లు తెలిసింది.ఎన్నికల కౌంటింగ్ ఇంకా పదకొండు రోజులు మాత్రమే సమయం ఉంది. ఈ పన్నెండు రోజులే కాదు.. కౌంటింగ్ రోజు తర్వాత కూడా అక్కడ బితుబితుకుమంటూ బతుకీడవాల్సిందే. ఎన్ని రోజులనేది ఎవరూ చెప్పలేని పరిస్థితి. శాంతిభద్రతలను పరిరక్షించాల్సిన బాధ్యత కేవలం పోలీసులదే కాదు. ఆ బాధ్యత రాజకీయనేతల పైన కూడా ఉంటుంది. ప్రధానపార్టీల అగ్రనేతల నుంచి స్థానిక నేతల వరకూ తమ అనుచరులను కంట్రోల్ చే?యగలిగితేనే పరిస్థితులు సానుకూలంగా మారతాయి. ప్రజలు సుఖశాంతులతో ఉంటారు. అంతే తప్ప కేవలం పోలీసుల మీద నెపాన్ని నెట్టేసి నేతలు పగలు, ప్రతీకారం అని కూర్చుంటే ఎక్కడైనా సరే రాజేసిన మంటలు ఆరిపోవు. అలాగే అమాయకుల బలవుతూనే ఉంటారు.  ఇక్కట్లు పాలవుతూనే ఉంటారు. అందుకే నేతలు ఇప్పటికైనా మేల్కొని శాంతి జెండా ఎగురవేయాలని అందరూ కోరుతున్నారు.

# బెజవాడకు  రేవ్ పార్టీ లింక్...


విజయవాడ, మే 24  బెంగళూరు రేవ్ పార్టీ సినీ ఇండస్ట్రీనేకాదు.. తెలుగు రాష్ట్రాలను కుదిపేస్తోంది. తాజాగా విజయవాడలో రేవ్ పార్టీ మూలాలు బయటపడ్డాయి. రేవ్ పార్టీకి ప్రధాన నిందితుడు వాసు అలియాస్ లంకపల్లి వాసు విజయవాడ వాసి. కొత్తపేటలోని ఆంజనేయవాగుకు చందిన వాసు.. హైదరాబాద్, బెంగళూరు నుంచి క్రికెట్ బెట్టింగ్ లు నిర్వహిస్తుంటాడు. విజయవాడలోనూ అతిపెద్ద బుకీల నెట్ వర్క్ ను విస్తరించాడు వాసు. బర్త్ డే సందర్భంగా వాసు స్వయంగా బెంగళూరులోని ఫామ్ హౌస్ పార్టీని ఏర్పాటు చేయగా.. విజయవాడకు చెందిన నలుగురు ప్రధాన బుకీలు మిగిలిన ఏర్పాట్లు చేసినట్లుగా తెలుస్తోంది. హైదరాబాద్ లోనే మకాం వేసిన వాసు.. అక్కడి నుంచే మొత్తం వ్యవహారం నడిపించినట్లుగా తెలుస్తోంది.బెంగళూరు రేవ్ పార్టీ పై పోలీసుల దర్యాప్తు ముమ్మరం చేశారు. ఈ కేసులో ఇప్పటికే ఐదుగురిని అరెస్ట్ చేశారు. పార్టీ నిర్వాహకులు లంక పల్లి వాసు విజయవాడ వాసిగా గుర్తించిన పోలీసులు.. అతనికి చాలా మంది సినీ సెలబ్రెటీలు, రాజకీయ నేతలతో పరిచయం ఉందని గుర్తించారు. ప్రతి సంవత్సరం వాసు పార్టీలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిసింది. క్రికెట్ బెట్టింగులను సైతం వాసు నిర్వహించేవాడు. ఐపీఎల్ సీజన్ లో కోట్ల రూపాయలు బిజినెస్ జరిగిందని, దీంతో సెలబ్రెటీలతో, రాజకీయ నేతలతో పార్టీకి వాసు ప్లాన్ చేసినట్లు తెలిసింది. గత ఆదివారం బెంగళూరు శివారులోని ఫామ్ హౌస్ లో వాసు రేవ్ పార్టీని ఏర్పాటు చేశాడు. పోలీసులు దాడులు చేసి రేవ్ పార్టీ లో డ్రగ్స్ సీజ్ చేశారు. రేవ్ పార్టీ కి వచ్చిన వారి వద్ద నుండి బ్లెడ్ షాంపుల్స్ తీసుకున్నారు. వాటిని ఈూఒ కు పంపించారు. డ్రగ్స్ పెడ్లర్స్ తో వాసుకున్న సంబంధాల పై పోలీసులు ఆరా తీస్తున్నారు మరోవైపు సినీనటి హేమ కూడా ఈ రేవ్ పార్టీ లో ఉన్నట్లు పోలీసులు ఇప్పటికే స్పష్టం చేశారు. కానీ, తాను ఆ రేవ్ పార్టీకి వెళ్లలేదంటూ హేమ బుకాయిస్తున్నారు. ఈ మేరకు తాను ఇంట్లోనే ఉన్నట్లు పలు వీడియోలను సామాజిక మాధ్యమాల్లో షేర్ చేస్తున్నారు. మరోవైపు బ్లెడ్ శాంపిల్స్  లో డ్రగ్స్ తీసుకున్నట్లు రూఢీ కావడంతో చర్యలు తీసుకొనేందుకు పోలీసులు సిద్ధమవుతున్నారు.

# పాపం... ఆ ముగ్గురు

విజయవాడ, మే 24 ( ఏపీలో ఎన్నికలు ముగిస్తాయి. ఫలితాల కోసం అభ్యర్థులు నిరీక్షిస్తున్నారు. పోలింగ్ కు, కౌంటింగ్ కు మధ్య మూడు వారాల సమయం ఉండడంతో అభ్యర్థులు రిలాక్స్ మూడ్ లోకి వెళ్ళిపోయారు. కొందరు విదేశీ పర్యటనలకు వెళ్ళగా.. మరికొందరు విహారయాత్రలో మునిగిపోయారు. అయితే ఎన్నికలకు ముందే ఏపీకి చెందిన బిజెపి సీనియర్లు కనిపించకుండా పోయారు. ఎన్నికల ప్రచారంలో కానీ, క్యాంపెయినింగ్లో కానీ వారి జాడ లేకుండా పోయింది. ఫలితాల ప్రకటన తర్వాత వారు ఎలా రియాక్ట్ అవుతారన్నది చూడాలి.ఏపీ బిజెపి రాష్ట్ర మాజీ అధ్యక్షుడు సోము వీర్రాజు ఈ ఎన్నికల్లో ఎక్కడా కనిపించలేదు. అసలు బిజెపి అభ్యర్థుల తరపున కూడా ప్రచారం చేయలేదు. ఆది నుంచి టిడిపి తో బీజేపీ పొత్తును వీర్రాజు వ్యతిరేకించారు. అయితే అనూహ్యంగా ఆయనకు రాష్ట్ర అధ్యక్ష పదవి నుండి తప్పించి పురందేశ్వరిని తెరపైకి తెచ్చారు. టిడిపి తో పొత్తు కుదరడం, సీట్ల సర్దుబాటు వంటి అంశాల్లో కనీసం వీర్రాజుకు సంబంధం లేకుండా పోయింది. చివరకు సోము వీర్రాజు సొంత ప్రాంతమైన రాజమండ్రిలో పురందేశ్వరి పోటీ చేసినా ఆమెకు మద్దతు తెలపలేదు.మరో నేత విష్ణువర్ధన్ రెడ్డి జాడ సైతం ఈ ఎన్నికల్లో కనిపించలేదు. బిజెపిలో ఉండి వైసిపికి అనుకూలంగా పనిచేస్తారన్నది విష్ణువర్ధన్ రెడ్డి పై ఉన్న ఆరోపణ. ఈయన కూడా టిడిపి తో పొత్తుని వ్యతిరేకించారు. పొత్తుకు ముందు అనేక రకాల వ్యాఖ్యలు చేశారు. పొత్తు కుదిరిన తర్వాత హిందూపురం పార్లమెంట్ సీటు గురించి ప్రయత్నం చేశారు. కానీ ఈయన ప్రయత్నాలు ఏవి ఫలించలేదు. అయితే కూటమి మేనిఫెస్టో బిజెపికి సంబంధం లేదంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల ప్రచారంలో కానీ, ఎలక్షన్ క్యాంపెయినింగ్ లో కానీ ఎక్కడా కనిపించలేదు.మాజీ ఎంపీ జీవీఎల్ నరసింహారావు మాత్రం అడపాదడపా మీడియాతో మాట్లాడారు. కేంద్రంలో ఎన్డీఏ, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని తేల్చి చెప్పారు. విశాఖ ఎంపీ సీటును ఆశించిన ఆయన.. చివరి వరకు ప్రయత్నించారు. దక్కకపోయేసరికి అసంతృప్తికి గురయ్యారు. కానీ ఎక్కడా కూటమికి మద్దతుగా ప్రచారం చేయలేదు. బిజెపి అగ్ర నేతలు వచ్చినప్పుడు కూడా కనిపించలేదు. ఒకవేళ కూటమి గెలిస్తే ఈ నాయకుల పాత్ర ఏమిటి అన్నది తెలియాల్సి ఉంది. కూటమి ఓడిపోతే మాత్రం వీరి స్వరం పెరిగే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి.

# సిక్కోలులో  శిరీషా వర్సెస్ అప్పలరాజు

శ్రీకాకుళం, మే 23  శ్రీకాకుళం జిల్లా లో ఉన్న నియోజకవర్గాల్లో పలాసపైనే అందరి దృష్టి ఉంది. గత ఐదేళ్లుగా ఈ నియోజకవర్గంలో రాజకీయం గరం గరంగానే ఉంది. నిత్యం విమర్శలు ప్రతి విమర్శలతో అక్కడ పొలిటికల్ డైలాగ్ వార్ నిత్యం వార్తల్లో ఉంటూ వచ్చింది. ఓ వైపు మంత్రి సీదిరి అప్పలరాజు మరో వైపు టీడీపీ అభ్యర్థిని గౌతు శిరీషాకు మధ్య పచ్చగడ్డివేస్తే భగ్గుమనే వాతావరణం నెలకొంది. ఆ క్రమంలో ఈ సారి ఎన్నికలలో గత సారి కంటే పోలింగ్ శాతం పెరగడంతో పలాస ఓటర్లు ఎవరికి పట్టం కట్టారనేది ఆసక్తి రేపుతుంది.పలాస నియోజకవర్గం అంటే గుర్తొచ్చేది సర్ధార్ గౌతు లచ్చన్న  ఉమ్మడి మద్రాస్ రాష్ట్రంలో సోంపేట..శ్రీకాకుళం సిటీ నియోజకర్గం నుంచి పోటీ చేసి గెలుపొందారు. గౌతు లచ్చన్న కుమారుడు గౌతు శివాజీ ఆయన సైతం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో శ్రీకాకుళం జిల్లా సోంపేట నియోజకవర్గం నుంచి 4 సార్లు.. పలాస నియోజకవర్గం ఏర్పడిన తరువాత ఒక సారి టీడీపీ నుంచి పోటీచేసి గెలుపొంది మంత్రిగా పనిచేశారు.గతంలో ఎప్పుడూ పలాస నియోజకవర్గంలో రాజకీయ విమర్శలు ఒక స్థాయి దాటలేదు. 2019 తరువాత పలాసలో రాజకీయం పూర్తిగా మారిపోయింది. విమర్శలు .. ప్రతి విమర్శలతో రాజకీయం వేడెక్కింది. 2019 ఎన్నికలో గెలిచి వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత విమర్శల దాడి పెరిగింది. సిద్ధాంత పరమైన విమర్శల కంటే..వ్యక్తిగత విమర్శలకు వైసీపీ నాయకులు అధిక ప్రాధాన్యత ఇవ్వడం మొదలు పెట్టారు. అదే ఒరవడిని పలాస నియోజకవర్గ వైసీపీ నాయకుడు సీదిరి అప్పలరాజు వంటపట్టించుకున్నారనే విమర్శ కూడా ఉంది. 2019 ఎన్నికలో మొదటిసారిగా సీదిరి అప్పలరాజు పలాస నియోజకవర్గం నుంచి వైసీపీ అభ్యర్థిగా పోటీచేసి గెలుపొందారు.టీడీపీ నుంచి పోటీ చేసిన మాజీ మంత్రి గౌతు శివాజీ కుమార్తె గౌతు శిరీషపై సుమారు 15 వేల ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. అప్పటి నుంచే పలాస లో రాజకీయ వేడి మొదలైంది. మొదటిసారి గెలిచిన సీదిరి అప్పలరాజుకి ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మంత్రి పదవి సైతం కట్టబెట్టారు. అసలు గెలిచిన నాటి నుంచే అప్పలరాజు పలాస లో ప్రతీకార రాజకీయాలు మొదలు పెట్టరాన్న విమర్శలున్నాయి. పలాస నగరం నడిబొడ్డున ఉన్న స్వాతంత్ర సమరయోధులు సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహం తొలగించడానికి ప్రయత్నించడం వివాదాస్పదంగా మారింది.ప్రభుత్వ స్థలం అక్రమించి గౌతు లచ్చన్న విగ్రహం ఏర్పాటు చేశారన్న నేపంతో అధికారుల సాయంతో అప్పలరాజు గౌతు లచ్చన్న విగ్రహాన్ని తొలగించేగించేందుకు ప్రయత్నించారు.అయితే గౌతు లచ్చన విగ్రహం ఉన్న స్థలం యాజమాని అది తన సొంత స్థలం అని తన వద్ద ఉన్న పత్రాలు చూపించడంతో మునిసిపాలిటీ అధికారులు వెనుదిరిగారు. కేవలం గౌతు శిరీషా పై అక్కసు తోనే సీదిరి అప్పలరాజు సమరయోధుడ్ని అవమానించడానికి తెగించారన్న ఆరోపణలు వెల్లువెత్తాయి.మరో వైపు పలాస



శ్రీనగర్ కాలనీలోని కోడేలు చెరువు ప్రాంతాన్ని టీడీపీ నాయకులు ఆక్రమించి ఇళ్ల నిర్మాణాలు చేశారనే నెపంతో శ్రీనగర్ కాలనీ ప్రాంతంలో ఉన్న నిర్మాణాలని మునిసిపాలిటీ అధికారులు తొలగించడానికి ప్రయత్నించంతో అప్పట్లో పెద్ద రచ్చే జరిగింది. నిర్మాణాల కూల్చివేతని నిరసిస్తూ.. లోకేష్ పలాస వస్తుండగా ఆయన్ని అరెస్ట్ చేయడం వివాదాస్పదమైంది. ఆ క్రమంలో మంత్రి అప్పలరాజు గౌతు శిరీషని, టీడీపీ కేడర్ని ఇబ్బంది పెట్టడానికి కంకణం కట్టుకున్నారన్న అభిప్రాయం వ్యక్తమైంది. తాజా ఎన్నికల్లో ఆ ప్రభావం అప్పలరాజుకు వ్యతిరేకంగా రిఫ్లెక్ట్ అయిందన్న వాదన వినిపిస్తుంది.ఇదంతా ఒక ఎత్తయితే.. మంత్రి సిదిరి అప్లలరాజు పలాస లో అనేక ఆక్రమణలకు పాల్పడ్డారనే ఆరోపణలు కూడా ఉన్నాయి. మంత్రి అయిన తరువాత భూముల ఆక్రమణలతో పాటు సూది కొండ, నెమలి కొండలను కూడా నిబంధనలకి విరుద్ధంగా తవ్వేశారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.. మంత్రి అప్పలరాజుపై గౌతు శిరీష నిత్యం విమర్శలు గుప్పిస్తునే ఉన్నారు. పలాస నియోజకవర్గంలో మంత్రి అప్పలరాజు చేసిన అభివృద్ధి ఏమిలేదని టార్గెట్ చేస్తూ వచ్చారు. మంత్రి భూ ఆక్రమణలు గ్రావెల్ కోసం కొండల అక్రమ తవ్వకాలపై శిరీషా ఆందోళనలు నిర్వహించారు. నామినేషన్ టైంలోనూ ప్రశాంత పలాస కోసం క?షి చేస్తానని ప్రకటించారుఆ క్రమంలో పలాస నియోజకవర్గం లో అటు మంత్రి సీదిరి అప్పలరాజు.. ఇటుగౌతు శిరీషా ల మధ్య పచ్చ గడ్డి వేస్తే భగ్గుమనే వాతావరణం నెలకొంది. గౌతు శిరీషా తనపై చేస్తున్న ఆరోపణలు.. విమర్శలు తట్టుకోలేక మంత్రి అప్పలరాజు ఆమెని వ్యక్తిగతంగా ఇబ్బనీది పెట్టేందుకు.. పలాసలో గౌతు శిరీషా కొత్తగా సొంత ఇంటి నిర్మాణానికి ప్రయత్నిస్తే దానికి కూడా మంత్రి అప్పల రాజు అనేక అడ్డంకులు సృష్టించారు. ఏదేమైనా ప్రశాంతంగా ఉండే పలాసలో ఈ సారి ఎన్నిక ఉత్కంఠభరితంగా మారింది.సిదిరి అప్పల రాజు రాజకీయాలకు రాకముందు కార్డియాలజీ డాక్టర్‌గా మంచి పేరు ఉండేది. ఆర్థికంగా ఇబ్బందిపడే రోగుల ఫీజు మందుల విషయం లో సహాయం చేసేవారనే గుర్తింపు ఉండేది. అలాంటి డాక్టర్ రాజకీయాల్లోకి వచ్చిన తరువాత తనలోని మరోకోణం చూపిస్తున్నా రన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అవినీతి ఆరోపణలకు తోడు తన రాజకీయ ఎదుగుదలకు సహకరించిన దువ్వాడ శ్రీకాంత్, హేమబాబు చౌదరి లను పక్కన పెట్టడం కూడా ఈ సారి ఎన్నికలో అప్పల రాజుకి నెగిటివ్ అవుతుందని రాజకీయ రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. 2019 ఎన్నికల్లో అప్పలరాజుకి టికెట్ దక్కేలా చేయడంలో దువ్వాడ శ్రీకాంత్, వివేకానంద విద్యాసంస్థ అధినేత మెట్ట కుమారస్వామి కీరోల్ పోషించారు .. అయితే అప్పల రాజు మంత్రి అయిన తరువాత దువ్వాడ శ్రీకాంత్‌ని పక్కనపెట్టేశారు. స్థానికంగా బలమైన అనుచరవర్గం ఉన్న దువ్వాడ శ్రీకాంత్ పలాసకు చంద్రబాబు వచ్చినప్పుడు అనుచరవర్గంతో పసుపు కండువా కప్పుకున్నారు. దువ్వాడ శ్రీకాంత్ ఎఫెక్ట్‌తో అప్పల రాజుకి పలాసలో పెద్ద దెబ్బే పడుందంటున్నారుఎన్నికలముందు వరకు అప్పలరాజు విజయావ కాశా లపై పాజిటివ్ టాక్ వినిపించింది.. అయితే దువ్వాడ శ్రీకాంత్, హేమ బాబు చౌదరిలు టీడీపీలో జాయిన్ అయి గౌతుశిరీషకుమద్దతుప్రచారం చేయడంతో.. ఇప్పుడు సొంత పార్టీ వారే మంత్రి గెలుపుపై పెదవి విరుస్తున్నారు.. గత ఎన్నికల్లో అప్పలరాజు సుమారు 16 వేల మెజార్టీతో గెలిచారు ..72.9 శాతం పోలింగ్ జరిగిన 2019 ఎన్నికల్లో జనసేన, బీజేపీ ఓట్ల చీలిక అప్పలరాజుకుకి ప్లస్ అయింది. అయితే ఈ సారి కూటమి అభ్యర్థిగాగౌతుశిరీషతిరిగిపోటీ చేయడం కలిసి వస్తుందంటున్నారు

## డ్రైనేజీలను ఆక్రమిస్తే కూల్చివేస్తాం

### మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మే 24-: ప్రధాన వీధుల్లోని డ్రైనేజీలను ఆక్రమిస్తే కూలగొడతామని మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలోని షాదిక్ నగర్. విజయ పురి కాలనీ సలీం నగర్. బొమ్మల సత్రం. తెలుగు పేట - వార్డులో అసిస్టెంట్ కమిషనర్ డాక్టర్ అంకిరెడ్డి. శానిటేషన్ సూపరైజర్ లక్ష్మినారాయణ. శివ ప్రసాద్ రెడ్డి తో కలిసి కమిషనర్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. పలు వీధుల్లో పర్యటించి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. డ్రైనేజీలపై నిర్మించిన ఆక్రమణ లను కూల్చివేయాలని సిబ్బందిని ఆదేశించారు.

## రైతు భరోసా కేంద్రాలలో జీలుగలు

### మండల వ్యవసాయాధికారి ప్రసాద రావు



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మే 24- రైతు భరోసా కేంద్రాల లో జీలుగలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని నంద్యాల మండల వ్యవసాయ అధికారి . ఇ. ప్రసాద రావు పేర్కొన్నారు. శుక్రవారం వ్యవసాయ విస్తరణ అధికారులను మరియు గ్రామ స్థాయిలోని గ్రామ వ్యవసాయ సహాయకులు మరియు ఉద్యాన సహాయకులు ఖరీఫ్ 2024 కి సంసిద్ధత మరియు కార్యచరణల పై సమావేశము నిర్వహించారు. సమావేశములో వ్యవసాయ అధికారి ప్రసాద రావు మాట్లాడుతూ నంద్యాల మండలానికి పచ్చిరొట్ట ఎరువులైన జీలుగాలు 320 క్వింటాల్లు మరియు 4 క్వింటాల్లు పిల్లిపెసర మంజూరు చేశారని వాటిని రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు వెంటనే పంపిణీ చేయాలని తెలియజేసారు. అలాగే 12 యూనిట్ ల బీపిటి 5204 రకం వరి ఫౌండేషన్ విత్తనాలను గ్రామీణ విత్తన ఉత్పత్తి పథకం క్రింద ఇవ్వడం జరిగిందని వీటిని కూడా రైతు భరోసా ల ద్వారా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఈ ఖరీఫ్ కాలానికి 7468 హెక్టార్లు సాధారణ విస్తీర్ణము లో వరి, మొక్కజొన్న, కంది, మినుము, ప్రత్తి, మరియు ఇతర పంటలు సాగుచేస్తారని, కాగా ఈ పంటలకు సరిపడా ఎరువులు సిద్ధంగా ఉన్నాయని రైతులకు రైతు భరోసా ల ద్వారా ఎరువులు అందిస్తామని తెలిపారు . అలాగే పంట నమోదు ప్రక్రియ చాలా జాగ్రత్తగా చేపట్టాలి అని తెలియజేసారు.

## కౌంటింగ్ పర్సనల్స్ కు 813 మంది

### జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి డా. కె. శ్రీనివాసులు



---విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మే 24-సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు సిబ్బందికి సంబంధించి మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేసినట్లు కలెక్టర్, మరియు జిల్లా ఎన్నికల అధికారి డా. కె. శ్రీనివాసులు పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టరేట్ లోని ఆయన ఛాంబర్ లో జాయింట్ కలెక్టర్ టి రాహుల్ కుమార్ రెడ్డితో కలిసి కౌంటింగ్ పర్సనల్స్ 1వ ర్యాండమైజేషన్ ప్రక్రియను పూర్తి చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ డా. కె. శ్రీనివాసులు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపుకు సంబంధించి భారత ఎన్నికల కమిషన్ సూచించిన ప్రత్యేక సాఫ్ట్ వేర్ ద్వారా కౌంటింగ్ సిబ్బంది 1వ ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేసామన్నారు. కౌంటింగ్ కోసం 813 మంది కౌంటింగ్ సిబ్బందిని సీపీఎంఎస్ సాఫ్ట్ వేర్ లో ఆన్ లైన్ ద్వారా అత్యంత పారదర్శకతతో మొదటి ర్యాండమైజేషన్ ప్రక్రియను చేపట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆళ్లగడ్డ, డోన్, నందికొట్కూరు, బనగానపల్లె అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు మల్లికార్జున్ రెడ్డి, మహేశ్వర్ రెడ్డి, ఎం దాసు,కామేశ్వరావు, ఎన్ఐసి నెట్వర్క్ ఇంజనీర్ నవీన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# రౌండ్ల వారి ఓట్ల వివరాలు జాగ్రత్తగా నమోదు చేయండి

### జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి



విభారె న్యూస్ నంద్యాల మా ప్రతినిధి మే 24-సాధారణ ఎన్నికలు -2024 కౌంటింగ్ కు సంబంధించి ఎన్నికల ఫలితాల రౌండ్ల వారి ఓట్ల వివరాలు ఎప్పటికప్పుడు జాగ్రత్తగా నమోదు చేయాలని జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి కౌంటింగ్ కంప్యూటర్ సహాయకులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో సాధారణ ఎన్నికలు-2024 కౌంటింగ్ కు సంబంధించి జిల్లాలోని 6 అసెంబ్లీ నియోజకవర్గాలు, పార్లమెంటు నియోజకవర్గానికి సంబంధించి ఆన్లైన్ ఎంట్రీ డాటా పై శిక్షణ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ టి. రాహుల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ పార్లమెంట్ అసెంబ్లీ నియోజకవర్గాల ఓట్ల లెక్కింపుకు సంబంధించి రౌండ్ల వారి ఎన్నికల ఫలితాలు ఎప్పటికప్పుడు తెలుసుకునేందుకు వీలుగా జాగ్రత్తగా నమోదు చేయాలని శిక్షణ పొందుతున్న కౌంటింగ్ కంప్యూటర్ సహాయకులను ఆదేశించారు. ఈ డాటా ఎంట్రీ వలన ఎన్నికల ఫలితాలు ఎప్పటికప్పుడు తెలుసుకునే వీలుంటుందన్నారు. అదేవిధంగా డాటా ఎంట్రీ చేసే సమయంలో కంప్యూటర్ సహాయకులు ఓట్ల లెక్కింపు వివరాలను , అభ్యర్థులకు ఏ రౌండ్ లో ఎన్ని ఓట్లు వచ్చాయనే వివరాలను కూడ చాలా జాగ్రత్తగా నమోదు చేయాలని శిక్షణ పొందుతున్న సిబ్బంది సూచించారు. జిల్లా రెవెన్యూ అధికారి శ్రీమతి పద్మజ, మున్సిపల్ ఇంజనీర్ మధు కుమార్, అన్ని నియోజకవర్గాల కౌంటింగ్ కంప్యూటర్ సహాయకులు పాల్గొన్నారు.

# జిల్లాకు భారీ వర్ష సూచన..

### అధికారులంతా అత్యంత అప్రమత్తంగా ఉండాలి

### ఆయా శాఖల పరిధిలో కార్యాచరణ ప్రణాళిక అమలు చేసి జాగ్రత్త చర్యలు తీసుకోవాలి

### జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ వినోద్ కుమార్.వి (ఐఏఎస్)



అనంతపురం, మే 23 :రాబోయే మూడు, నాలుగు రోజుల్లో జిల్లాలో భారీ వర్షాలు వచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో అన్ని విధాల సిద్ధంగా ఉంటూ అత్యంత అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి డాక్టర్ వినోద్ కుమార్.వి (ఐఏఎస్) ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. గురువారం అనంతపురం కలెక్టరేట్ లోని రెవెన్యూ భవనంలో వచ్చే 3, 4 రోజుల్లో జిల్లాలో భారీ వర్షాలు కురువనున్న నేపథ్యంలో తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలు, ఏర్పాట్లపై సంబంధిత శాఖల జిల్లా అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ భారీ వర్షాలు వస్తే ఏం చేయాలి అనే దానిపై ఆయా శాఖల పరిధిలో కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకొని క్షేత్రస్థాయిలో అమలు చేయాలన్నారు. తహసిల్దార్లు, వీఆర్వోలు, వీఆర్ఏలు వర్షాలు వస్తున్నవేళ ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని తెలియజేయాలని, చెరువులు, వాగులు, వంకల్లో నీటి ప్రవాహ స్థాయిలను తెలపాలని, నిత్యవసరాలను, పాలు, నీళ్లు విలువ ఉంచుకునేలా చూడాలన్నారు. ఆర్డీవో కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్ లను ఏర్పాటు చేయాలన్నారు. ఆర్డీవో, తహసిల్దార్ కార్యాలయాల్లో రేడియో సౌకర్యం కల్పించాలన్నారు. వ్యవసాయ శాఖ పరిధిలో వరి, మొక్కజొన్న పంటలు కోత సమయంలో ఉండడంతో నీరు నిల్వంచకుండా రైతాంగం చూసుకోవాలని, రైతులకు అవసరమైన టార్పాలిన్ లను అందించాలన్నారు. గ్రామ, మండల స్థాయిలో నాయకులతో సమావేశాలు నిర్వహించుకుని వర్షాలపై, జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు. వర్షాలపై కమాండ్ కంట్రోల్ నుంచి మానిటర్ చేయాలన్నారు. పశువులు చనిపోకుండా షెడ్డులో పెట్టుకునేలా రైతులను అప్రమత్తం చేయాలని, ఆర్టీసీ బస్సులు కల్వర్టులు, కాజ్వేలలో వెళ్లకుండా డ్రైవర్ లకు అవగాహన కల్పించడం చేయాలని ఆదేశించారు. భారీ వర్షం వల్ల విద్యుత్ పోల్స్ పడిపోయినా త్వరితగతిన మరమ్మతులు చేసి విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూసుకోవాలన్నారు. అనంతపురం నగరపాలక సంస్థ పరిధిలో ఒక టీం ఏర్పాటు చేసి ఎమర్జెన్సీ రెస్పాన్స్ వాహనం సిద్ధంగా ఉంచుకొని ఇబ్బంది వస్తే వెంటనే రెస్పాన్స్ అవ్వాలని, డ్రైనేజీ పూడిక, పడిపోయిన చెట్ల తొలగింపు ఎప్పటికప్పుడు చేయాలన్నారు. నీటి ప్రవాహం ఎక్కువైనప్పుడు లోతట్టు ప్రాంతాలు మునిగిపోయే అవకాశం ఉందని, వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. రెవెన్యూ అధికారులు పోలీసు వారితో ఎప్పటికప్పుడు కమ్యూనికేషన్ లో ఉండాలని, వారికి అవసరమైన సహకారం అందించాలన్నారు. వచ్చే 48 గంటల్లోపు జిల్లాలోని ఎఫ్.పి షాపులకు రేషన్ సరఫరా చేయడం పూర్తి చేయాలన్నారు. గతంలో నీటి ప్రవాహాలకు గురైన లోతట్టు ప్రాంతాల్లో తహసిల్దార్లు సమావేశం నిర్వహించి భారీ వర్షాలపై ప్రజలకు తెలియజేయాలని, గుత్తిలో భారీ వర్షం పై అవగాహన పెంచాలన్నారు. జిల్లా అధికారులంతా వారి శాఖ పరిధిలో వల్నరబుల్ ప్రాంతాలను గుర్తించి పర్యటించాలని, అర్బన్ ప్రాంతాల్లో డ్రైనేజీలను శుభ్రం చేయించాలన్నారు. వర్షాల వల్ల కల్వర్టులు వెంటనే తెగిపోయే అవకాశం ఉందని, రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన మట్టి, కంకర సిద్ధంగా పెట్టుకోవాలన్నారు. ఆర్డబ్ల్యూఎస్ పరిధిలో చేతిపంపుల మరమ్మతులు పూర్తి చేయాలని, ఉపాధి హామీ కింద హెచ్.ఎల్.సి కాలువలో డీసిల్టింగ్ పనులు చేపట్టాలన్నారు. వర్షాలు వస్తున్న నేపథ్యంలో ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు రాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, జిల్లా అధికారులు కార్యచరణ ప్రణాళిక ప్రకారం పని చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో నగర పాలక సంస్థ కమిషనర్ మేఘ స్వరూప్, జిల్లా పరిషత్ సీఈవో వైఖోమ్ నిదియా దేవి, అసిస్టెంట్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న, డిఆర్ఓ జి.రామకృష్ణారెడ్డి, అడిషనల్ ఎస్పీ విజయభాస్కర్ రెడ్డి, ఆర్డీఓలు రాణిసుస్మిత, వి.శ్రీనివాసులు రెడ్డి, జి.వెంకటేష్, డిపిఎం ఆనంద్, డిప్యూటీ కలెక్టర్లు వసంతబాబు, వెన్నెల శ్రీను, కరుణ కుమారి, వ్యవసాయ శాఖ జెడి ఉమామహేశ్వరమ్మ, సిపిఓ అశోక్ కుమార్ రెడ్డి, పశుసంవర్ధక శాఖ జెడి సుబ్రహ్మణ్యం, ఏపీఎస్ఆర్టీసీ ఆర్ఎం సుమంత్, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ సురేంద్ర, సివిల్ సప్లై డిఎం రమేష్ రెడ్డి, డిఎస్ఓ శోభారాణి, డిఆర్డిఏ పిడి నరసింహారెడ్డి, డ్వామా పిడి వేణుగోపాల్ రెడ్డి, డీఈఓ వరలక్ష్మి, ఇంచార్జ్ డిఎంహెచ్వో డా.సుజాత, డిసిహెచ్ఎస్ పాల్ రవికుమార్, హెచ్ఎన్ఎస్ఎస్ ఎస్ఈ దేశేనాయక్, హెచ్ఎల్సి ఎస్ఈ రాజశేఖర్, హార్టికల్చర్ డిడి నరసింహారావు, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ఆర్డి పివిఎస్ఎన్ మూర్తి, ఐసిడిఎస్ పిడి శ్రీదేవి, మెప్మా పీడీ విజయలక్ష్మి, వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా నిలువ ఉంచిన టపాసులు సీజ్ : పట్నం యస్ ఐ నరసింహులు



ముదిగుబ్బ మే 24 మండలం పరిధిలో ఎనుముల వారి పల్లి గ్రామానికి చెందిన సూర్యనారాయణ రెడ్డి తండ్రి నాగిరెడ్డి, ఇంట్లో అక్రమంగా నిల్వ ఉన్న టపాసులను సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు పట్నం యస్ ఐ నరసింహులు తెలిపారు. జిల్లా ఎస్పీ మాధవ్ రెడ్డి ఐపీఎస్ ఆదేశాల మేరకు సమస్యాత్మకమైన గ్రామాల్లో విస్తృతంగా తనిఖీలు చేస్తుండగా, సూర్యనారాయణ రెడ్డి ఇంటి వెనుక భాగంలో ఉన్న గదిలో టపాసులను అక్రమంగా నిల్వ ఉంచారని పోలీసులకు రాబడిన సమాచారం మేరకు, తన సిబ్బందితో వెళ్లి ఆ ప్రాంతంలో తనిఖీలు చేపట్టగా ఒక గదిలో అక్రమంగా నిల్వ ఉంచిన రూ. 70,000,లు విలువగల టపాసులను స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లుయస్ ఐ నరసింహులు తెలిపారు. ఈ సందర్భంగా యస్ ఐ నరసింహులు మాట్లాడుతూ, జిల్లా ఎస్పీ మాధవ్ రెడ్డి ఐపిఎస్ ఆదేశాల మేరకు, అనుమాన స్పద గ్రామాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టడం జరుగుతుందని ఎన్నికల నిబంధనల మేరకు ఎవరూ కూడా టపాసులు కానీ పెట్రోలు, డీజిలు నిలువ ఉంచుకోవడం చట్టరిత నేరమని . అలా ఎవరైనా అక్రమంగా వీటిని కలిగి ఉంటే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవడమే కాక పోలీసుల పరంగా కేసులు నమోదు చేయడం జరుగుతుందని సిఐ హెచ్చరించారు.




కర్నూలు మండలం దిన్నెదేవరపాడు గ్రామంలోని జిఆర్సి కన్వెన్షన్ హాలులో సాధారణ ఎన్నికలు-2024 కౌంటింగ్ నిర్వహణపై కౌంటింగ్ సూపర్వైజర్స్, కౌంటింగ్ అసిస్టెంట్స్, మైక్రో అబ్జర్వలకు ఇచ్చే మొదటి సెషన్ జిల్లా స్థాయి శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్/ జిల్లా ఎన్నికల అధికారి డా.జి.సృజనకార్యక్రమంలో పాణ్యం రిటర్నింగ్ అధికారి నారపురెడ్డి మౌర్య, కర్నూలు రిటర్నింగ్ అధికారి భార్గవ తేజ, ఆదోని రిటర్నింగ్ అధికారి శివ్ నారాయణ్ శర్మ, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ చల్లా కళ్యాణి, డిఆర్ఓ మధుసూదన్ రావు, పత్తికొండ రిటర్నింగ్ అధికారి రామలక్ష్మి, కోడుమూరు రిటర్నింగ్ అధికారి శేషిరెడ్డి, ఎమ్మిగనూరు రిటర్నింగ్ అధికారి చిరంజీవి, మంత్రాలయం రిటర్నింగ్ అధికారి మురళీ, ఆలూరు రిటర్నింగ్ అధికారి రామునాయక్ తదితరులు

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH. PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190